నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, మంగళవారం 4 జూన్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డి బీచుపల్లి ఆంజనేయస్వామిని సోమవారం దర్శించుకున్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్సీకి ఈవో రామన్‌గౌడ్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజల అనంతరం శేషవస్త్రంతో సత్కరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. **- ఇటిక్యాల, జూన్ 3**

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా విజయం సాధించిన నవీన్‌కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా సోమవారం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకొని మొక్కు చెల్లించుకున్నారు. అంతకుముందు ఆయన అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి నూటాఎనిమిది టెంకాయలు కొట్టారు. అనంతరం అర్చకులు నవీన్‌కుమార్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లాను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. **- అలంపూర్, జూన్ 3**

జెండావిష్కరణ చేస్తున్న ఆర్ఎస్పీ, చిత్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

అభివృద్ధిలో తెలంగాణది అగ్రస్థానం

- దశాబ్ది ఉత్సవాల్లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితోనే రాష్ట్ర సాధన: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

వనపర్తి, జూన్ 3(నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఉత్తర భారతదేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజా, ప్రభుత్వ ప్రతినిధులు గడిచిన తొమ్మిదిన్నరేండ్ల కాలంలో తెలంగాణ అభివృద్ధిని చూసి ఇంత తక్కువ సమయంలో ఎలా చేశారని ఆశ్చర్యపోయేవారని నిరంజన్‌రెడ్డి చెప్పారు. సోమవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ప్రజల చిరకాల వాంఛకు పదేండ్లు నిండాయన్నారు. జూన్ 2న రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ ఎందరో అమరుల త్యాగఫలంగా సాకారమైందన్నారు. నాడు కేసీఆర్ ప్రారంభించిన ఉద్యమం వెలకట్టలేనిదని, రాష్ట్ర సాధన అనంతరం అభివృద్ధిలోనూ బీఆర్ఎస్ ఉద్యమ స్ఫూర్తితోనే దూసుకువెళ్లిందన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ అభివృద్ధిలో ముందు వరుసలో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. 14 ఏండ్లు పోరాటంతోనే ఇక్కడి ప్రజల కోరిక నెరవేరిందన్నారు. స్వరాష్ట్రం ఏర్పాటుతో తెలంగాణ అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి చెందిందన్నారు. ఉమ్మడి జిల్లాలో కృష్ణా నీటిని పారించి పసిడి పంటలకు నిలయం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం సీఎం సొంత జిల్లాలోనే బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించి రేవంత్‌రెడ్డికి పాలమూరు ప్రజలు ఝలక్ ఇచ్చారన్నారు. ప్రభుత్వం నుంచి ఎంత ఒత్తిడి వచ్చినా.. ప్రలోభాలకు లొంగకుండా మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పని చేయడంతోనే బీఆర్ఎస్ గెలుపు సాధ్యమైందన్నారు. ఇందుకు కష్టపడిన వారందరికీ ఆర్ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి అభిలాష్‌రావు, ఎంపీపీలు కృష్ణానాయక్, గుంత మౌనిక, జెడ్పీటీసీలు రఘుపతి రెడ్డి, సామ్యానాయక్, నాయకులు లక్ష్మయ్య, తిరుమల్, నాగన్నయాదవ్, అశోక్, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విష సంస్కృతికి రేవంత్ ఆజ్యం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ అనైతికం: నిరంజన్‌రెడ్డి
- శ్రీధర్‌రెడ్డి హత్యపై నిష్పక్షపాత విచారణ జరపాలి: ఆర్ఎస్పీ

మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి, చిత్రంలో ఆర్ఎస్పీ

వనపర్తి, జూన్ 3(నమస్తే తెలంగాణ) : రాజకీయాల్లో విష సంస్కృతికి సీఎం రేవంత్‌రెడ్డి ఆజ్యం పోస్తున్నాడని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సభ్యుల సంఖ్య తక్కువగా ఉన్నా పోటీ చేయించి వారి అభ్యర్థిని ఆర్థికంగా లూఠీ చేయించారని ఎద్దేవా చేశారు. సోమవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మాజీ మంత్రి జెండా విష్కరణ చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపు ప్రజాస్వామ్యానికి నిలువుటద్దమన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఇవి ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమన్నారు. పదేండ్ల తర్వాత 64 సీట్లు గెలిచి అధికారం చేపట్టిన కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడుతున్నదని.. దాడులను సీఎం రేవంత్ ప్రోత్సహిస్తున్నాడని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్‌కు 88సీట్లు వచ్చినా హత్యలు, భౌతిక దాడులు, అరాచకాలు లేవని, వ్యక్తిగత శత్రుత్వాలకు తావులేకుండా కేసీఆర్ పాలన కొనసాగిందన్నారు. దేశంలో 15 రాష్ట్రాలకు పైగా ప్రాంతీయ పార్టీలే అధికారంలో ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు స్థానిక ప్రజాప్రతినిధుల బలాన్ని చూసి కాంగ్రెస్ భయపడుతుందన్నారు. కొత్త బిచ్చగాళ్ల మాదిరి కాంగ్రెస్ నాయకులు ఎగిరెగిరి పడుతున్నారని, కాంగ్రెస్‌పై ప్రేమ ఉండి ప్రజలు అధికారం ఇవ్వలేదన్నది ఇప్పటికైనా గుర్తించకపోతే అభాసు పాలుకావడం తథ్యమని హెచ్చరించారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మినహా మిగతా హామీలన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. కేసీఆర్ పెట్టిన పథకాలను మార్పుచేయడంతోనే కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు సంతోషించేలా పాలన లేదని, దీనిపై మేధావులు మౌనం వీడాలన్నారు. తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్న కొన్ని పత్రికలు, రేవంత్‌రెడ్డికి సన్నిహితంగా మెలుగుతూ రాక్షసానందం పొందుతున్నాయన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ప్రతిఘటనను చవిచూస్తారని హెచ్చరించారు.

హత్యలపై విచారణ జరపాలి : ఆర్ఎస్పీ

శ్రీధర్‌రెడ్డి హత్యపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంత్రి జూపల్లి వ్యవహారశైలితో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలు కల్లోలిత ప్రాంతాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి 11రోజులు పూర్తయినా హంతకులను పట్టుకోవడంలో నిర్లక్ష్యమెందుకని ప్రశ్నించారు. రాజకీయంగా అనుమానం ఉన్న వ్యక్తులతో విచారణ జరిపి మమ అనిపించారన్నారు. శ్రీధర్‌రెడ్డి హత్యలో మంత్రి జూపల్లి సమాచారాన్ని దాస్తున్నారని, ఇది పోలీసులకు కూడా తెలుసని ఆరోపించారు. హత్యపై సీఎం స్పందించకపోవడం దారుణమన్నారు. మధ్యప్రదేశ్‌లో 65 మంది మృతికి కారణమైన సోం డిస్టిలరీస్‌ను రాష్ట్రానికి తెచ్చిన ఘటనలో మంత్రి జూపల్లి గందరగోళానికి గురై మాట్లాడుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెచ్చగొట్టే మాటల వల్ల కాంగ్రెస్ శ్రేణులు మరింత రెచ్చిపోతున్నారన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిదికాదని, కక్షసాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి శ్రీధర్, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి అభిలాష్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి, శ్యామ్యానాయక్, లక్ష్మారెడ్డి, రమేశ్‌గౌడ్, విజయ్‌కుమార్, అశోక్, బాలీశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పదేండ్ల పాలనలో అద్భుత అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే మర్రి

నాగర్‌కర్నూల్, జూన్ 3 : తెలంగాణ పదేండ్ల పాలనలో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం ముందు ముప్పన్నెల జెండా, పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మర్రి తెలంగాణ రాక ముందు, వచ్చిన పదేండ్ల కాలంలో కేసీఆర్ సారథ్యంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. 60 ఏండ్లుగా తొలిదశ ఉద్యమం నుంచి సాధించలేని ప్రత్యేక తెలంగాణను కేసీఆర్ సారథ్యంలో సాధించుకున్నామన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా 2014న టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణకు ప్రత్యేక నిధులు రావడంతో మంచిగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో రైతులకు 24గంటల విద్యుత్ అందజేస్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని గుర్తింపు తెచ్చుకున్నామన్నారు. ముఖ్యంగా రైతులకు ప్రోత్సాహకాలు అందించి వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్లామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయ్యిందని, ఇప్పటికే ప్రజలకు తెలంగాణ రాకముందు జరిగిన పరిణామాలు ఎదురవుతున్నాయన్నారు. కరెంటు కోతలు ప్రారంభమయ్యాయని, వరి పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొందన్నారు. ఏదేమైనా ప్రజలకు అన్యాయం జరిగితే వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచి ఉద్యమిస్తుందని వివరించారు. అంతకుముందు ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పనాభాస్కర్‌గౌడ్, జెడ్పీటీసీ శ్రీశైలం, నందకిశోర్‌రెడ్డితోపాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దశాబ్ది వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మర్రి, నేతలు

పాలమూరు కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుళ్లు

- నేడు ఎంపీ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో కౌంటింగ్‌కు అధికారుల ఏర్పాట్లు
- ఉదయం 8 గంటల నుంచే షురూ..
- 14 టేబుళ్లల్లో ఓట్ల లెక్కింపు
- మధ్యాహ్నానికి రిజల్ట్ వచ్చే అవకాశం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్లు

టిక్.. టిక్.. టిక్

మహబూబ్‌నగర్, జూన్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుండగా స్ట్రాంగ్ రూములో భద్రపరిచిన ఈవీఎంలను కేంద్రాలకు తరలించి ఓట్లు లెక్కించనున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో 14 టేబుళ్లు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో 14 టేబుళ్లు ఏర్పాటు చేసి కౌంటింగ్ చేపట్టనున్నారు. ఇప్పటికే ఆయా జిల్లాల రిటర్నింగ్ అధికారులు కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని ఎన్నికల సంఘం పరిశీలకులు ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు మరికొన్ని గంటల్లో ప్రారంభం అవుతుండడంతో అంతటా ఉత్కంఠ నెలకొన్నది. ఇప్పటికే ప్రధాన అభ్యర్థి గెలుస్తాడని చెప్పి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ బెట్టింగ్‌లు జరిగినట్లు సమాచారం. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల్లో ఎవరు పాగా వేస్తారో మంగళవారం మధ్యాహ్నానికే తేలిపోనుంది. కౌంటింగ్ జరుగుతున్న దృష్ట్యా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లో పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు సంబంధించి ఏడు సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు పాలమూరు యూనివర్సిటీలో, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు సంబంధించి నాగర్‌కర్నూల్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములో లెక్కింపు నిర్వహించనున్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. అనంతరం 8:30 నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. దీంతో కౌంటింగ్ కేంద్రం వద్ద ఆయా జిల్లాల పోలీసుల ఆధ్వర్యంలో పటిష్ట భద్రతను చేపట్టారు. సోమవారం కౌంటింగ్ ఏర్పాట్లను మహబూబ్‌నగర్ రిటర్నింగ్ అధికారి రవినాయక్, నాగర్‌కర్నూల్ రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్ పరిశీలించారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో మొత్తం 31మంది, నాగర్‌కర్నూల్ బరిలో 19 మంది అభ్యర్థులు పోటీ చేశారు.

నాగర్‌కర్నూల్ కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టంగా ఏర్పాట్లు

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా లెక్కింపు..

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఆయా లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఓట్ల లెక్కింపును నిర్వహించనున్నారు. కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 282 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 21 రౌండ్లు, నారాయణపేట 270 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్, 20 రౌండ్లు, మహబూబ్‌నగర్ లోని 275 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 20 రౌండ్ల వారీగా ఓట్లను లెక్కించనున్నారు. జడ్చర్ల 274 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 20 రౌండ్స్, దేవరకద్ర 289 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 21 రౌండ్స్, మక్తల్ 284 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 21 రౌండ్స్, షాద్‌నగర్ 263 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 19 రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు.

సీసీ కెమెరాల నిఘా నీడలో..

పార్లమెంట్ పరిధిలో జరిగే సెగ్మెంట్ల వారీగా ఉండే కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని ఇటు పోలీసుశాఖ అటు రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక కంట్రోల్ రూంల ద్వారా పర్యవేక్షిస్తారు. అంతే కాక కేంద్ర ఎన్నికల సంఘం పోర్టల్‌కు అనుసంధానిస్తారు. కేంద్రంలో ఏ చిన్న తప్పు జరిగినా వెంటనే సరిచేసేందుకు ఏర్పాట్లు చేశారు. రౌండ్ల వారీగా చేపట్టిన ఓట్ల లెక్కింపు ఫలితాలను ఎప్పటికప్పుడే మీడియాకు.. ఎలక్షన్ కమిషన్ పోర్టల్‌లో ఉంచనున్నారు. కౌంటింగ్ కోసం సూపర్‌వైజర్స్ 140 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 153, మైక్రోఅబ్జర్వర్లు 145 మంది, రిజర్వులో 20శాతం మంది సిబ్బందిని కేటాయించారు.

విజయం మాదే?

- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..?
- రెండు స్థానాలపై మూడు ప్రధాన పార్టీల్లో భారీ ఆశలు
- ఓటరు మహాశయుల కరుణ ఎవరికో..?

ఫలితాలపై ఉత్కంఠ..

ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు మరికొన్ని గంటల్లో ప్రారంభం కాబోతున్నది. గెలుపోటములపై అప్పుడే అంచనాలు వేసుకుంటున్నారు. రాష్ట్రంలో అధికారం మారడం, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడం.. సీఎం సొంత జిల్లా కావడంతో రెండు పార్లమెంట్ స్థానాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టిదెబ్బ తగలడంతో ఈ పార్లమెంట్ స్థానాలు కూడా ఉంటాయా.. ఊడుతాయా.. అనే చర్చ మొదలైంది. మరోవైపు బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ గెలుపు జోష్ కనిపిస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా సైలెంట్ ఓటింగ్ జరిగిందని ప్రభుత్వ వ్యతిరేకత ఓట్లు అనుకూలంగా మారాయని ఆ పార్టీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఇక బీజేపీ మాత్రం మోదీ హవా స్పష్టంగా కనిపిస్తుందని.. గెలుపు తమదేనంటూ చెబుతున్నారు. మొత్తంపైన రెండు పార్లమెంట్ స్థానాల్లో 50 మంది అభ్యర్థుల భవితవ్యం ఓటర్లు తేల్చనున్నారు.

తెలంగాణ కోసం పుట్టిన పార్టీ.. బీఆర్ఎస్

- కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికి మంచి భవిష్యత్
- తెలంగాణలో మళ్లీ ఎన్నికలొస్తే బీఆర్ఎస్‌దే అధికారం
- మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె



జాతీయజెండాకు సెల్యూట్ చేస్తున్న మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె, నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 3 : తెలంగాణ కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని.. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాతోపాటు బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఇంత తక్కువ కాలంలో ప్రజా వ్యతిరేకత కూడగట్టుకున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వమే అని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సాధ్యంకాని హామీలను ఇచ్చి అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఇప్పటి నుంచే ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్న పరిస్థితి గ్రామాల్లో ఉందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలు కేవలం మోదీ, రాహుల్ మధ్యనే జరిగాయన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో బీఆర్ఎస్ పార్టీ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారు కాబట్టే అదే జరిగిందన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచామని, రైతులకు ఉచిత కరెంట్, పంట పెట్టుబడి, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేశామన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా సంక్షేమం పూర్తిగా మరిచిందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్న విషయం ఎమ్మెల్సీ ఫలితంతో స్పష్టమైందని గుర్తు చేశారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 2014 తర్వాత తెలంగాణలో చాలా మార్పులు వచ్చాయని, కేసీఆర్ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టాయని గుర్తు చేశారు. బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదని, ఏ గ్రామానికి వెళ్లినా బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులే దర్శనమిస్తాయని వివరించారు. అనంతరం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అనాథ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, గ్రంథాలయాల సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మాజీ ఎంపీపీలు సుధాశ్రీ, బాలరాజు, నాయకులు శివరాజ్, దేవేందర్, కరుణాకర్‌గౌడ్, గణేశ్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, గోపాల్‌యాదవ్, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అడవిపంది బీభత్సం

- ఇండ్లల్లోకి చొరబడి మహిళలపై దాడి
- ఐదుగురికి తీవ్రగాయాలు
- నవాబ్‌పేట మండలం దాయపంతులపల్లిలో ఘటన

నవాబ్‌పేట, జూన్ 3 : మండలంలోని దాయపంతులపల్లి గ్రామంలో సోమవారం అడవిపంది బీభత్సం సృష్టించింది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు దాయపంతులపల్లి గ్రామ శివారులోని దట్టమైన చెట్ల పొదల నుంచి సోమవారం ఉదయం ఒక అడవిపంది గ్రామంలోకి వచ్చింది. కన్పించిన మహిళలపై విచక్షణా రహితంగా దాడి చేసింది. ఏకంగా ఇండ్లలోకి చొరబడి గండు వెంకటమ్మ, చాకలి నర్సమ్మ, గొల్ల వెంకటమ్మ, చాకలి బుడ్డమ్మ, చెన్నమ్మపై కాళ్ల గోర్లు, నోటితో దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులంతా వచ్చి పందిని బెదిరించడంతో గ్రామం నుంచి బయటకు వెళ్లి పోయింది. గాయపడ్డ మహిళలను గ్రామస్తులు 108 వాహనంలో జిల్లా దవాఖానకు తరలించారు.

నడిగడ్డ ప్రజలకు ఆత్మాభిమానం ఎక్కువ

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ వెంటే ప్రజాప్రతినిధులు..
- గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి
- ప్రజాప్రతినిధుల రుణం తీర్చుకుంటా: ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

గద్వాల, జూన్ 3 : నడిగడ్డ ప్రజలు ఆత్మాభిమానం గలవారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లను ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగకుండా బీఆర్ఎస్ వెంటే ఉండి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపునకు కృషి చేశారని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జిల్లా దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని చెప్పారు. ప్రస్తుతం ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని తెలిపారు . తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్‌పై ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిధుల కోసం కాంగ్రెస్‌పై పోరాటం చేస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రమంతటా వర్షాలు కురుస్తున్నాయని అయితే రైతులకు అవసరమైన విత్తనాలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన